

పోలమాంబ జాతర పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - మక్కువ

ఉత్తరాంధ్ర ఆరాధ్య దేవత శంబర పోల మాంబ అమ్మవారి జాతరకు సంబంధిం చిన గోడ పత్రికను డిప్యూటీ సిఎం రాజన్న దొర శు క్రవారం ఆవిష్కరిం చారు. కార్యక్రమంలో పోలమాంబ ఆలయ కార్యనిర్వహణ అధికారి రాధాకృష్ణ, ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పూడి దాలినాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు మావుడి శ్రీనివాసరావు, ఎంపిపి మర్రి పారమ్మ, వైసిపి నాయకులు రంగు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న డిప్యూటీ సిఎం

బోయ, వాల్మీకులను ఎస్‌టిలో కలపొద్దు

ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యాన ధర్నా



సాలూరులో ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న గిరిజనసంఘం జిల్లా అధ్యక్షులు అప్పారావు

రాష్ట్రంలోని బోయ, వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దంటూ ఎపి గిరిజనసంఘం ఆధ్వర్యాన జిల్లాలోని అన్ని మండల తహశీల్దార్ కార్యాలయాల వద్ద శుక్రవారం గిరిజనులు ధర్నా చేశారు. వీరిని ఎస్‌టి జాబితాలో చేరిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని వాచ్చరించారు. ధర్నా అనంతరం తహశీల్దార్లకు సమస్యలపై వినతులను అందజేశారు.

ప్రజాశక్తి - సాలూరు

బోయ, వాల్మీకి, బెంతుఒరియాలను ఎస్‌టి జాబితాలో చేరిస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని ఎపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సీదరపు అప్పారావు అన్నారు. ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందిన బోయ, వాల్మీకి, బెంతు ఒరియా కులస్తులను ఎస్‌టిలో చేరిస్తే ఇప్పటికే ఉన్న గిరిజన తెగలకు తీరని అన్యాయం జరుగుతుందని అన్నారు. కురుకూటిలో ప్రతిపాదిత హైడ్రో పవర్ ప్రాజెక్టు ఏర్పాటును విరమించుకోవాలని డిమాండ్ చేశారు. దీని వల్ల ఏడు గిరిజన గ్రామాలు పూర్తిగా కనుమరుగవుతాయని చెప్పారు. కొటియా గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకుండా పోతుందన్నారు. పాడైన చెక్ డ్యాం లను నిర్మించాలని కోరారు. పట్టు చెన్నూరు, సారిక,జిల్లేడు వలస లో అన్ సర్వే భూములను సర్వే చేసి సాగులో ఉన్న గిరిజనులకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. బొబ్బిలి మండలం నిమ్మల పాడు, సిహెచ్.బొడ్డవలస రెవిన్యూ పరిధిలో ఉన్న భూములను సాగు చేస్తున్న గిరిజనులకు, పాచిపెంట మండలం మోసూరు రెవిన్యూ పరిధిలో ఉన్న భూములను సాగు చేస్తున్న బట్టివలస గిరిజనులకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ప్రతినిధికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు సూకురు గంగయ్య, పెద్దఎత్తున గిరిజనులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : బెంతు ఒరియా, బోయ, వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దని, గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనులు ధర్నా చేశారు. ఈ ధర్నానుద్దేశించి ఎపి గిరిజన సంఘం రాష్ట్రవర్గ సభ్యులు కోలక అవినాష్ మాట్లాడుతూ బోయ,వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు వైసిపి ప్రభుత్వం యోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. . వైటిసి కేంద్రాలు మూసివేతతో యువతకు ఉపాధి శిక్షణ కరువైందన్నారు. స్పెషల్ డిఎస్సి ప్రసక్తే లేదన్నారు. ఏ రకంగా చూసినా గిరిజనుల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని ఆరోపించారు. గిరిజన హక్కులు, చట్టాలు కాపాడుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం తహశీల్దార్ రాములమ్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎపి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మండంగి రమణ, మండల అధ్యక్ష కార్యదర్శులు బిడ్డిక శంకర్రావు, పువ్వల తిరుపతిరావు, సిఐటియు మండల కార్యదర్శి కే గౌరీశ్వరరావు, కుక్కిడి సర్పంచ్ బిడ్డిక రాజారావు, గిరిజన సంఘం నాయకులు బిడ్డిక ఆడిత్, సత్యం, మేఘాలయ వివిధ గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

భామిని : బెంతు ఒరియా, బోయ, వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చద్దొంటూ గిరిజన సంఘా జెఎసి ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జెఎసి ప్రతినిధులు కొండగొర్రి భాస్కరరావు, బిడ్డిక కృష్ణారావు మాట్లాడుతూ బోయ, వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు నియమించిన వన్‌మ్యాన్ శామ్యూల్ కమిషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ ఎన్.అప్పారావుకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జెఎసి ప్రతినిధులు కొండగొర్రి చంటి, కె.ప్రసాద్, కీర్తిరాయి సుగ్రీవులు, కద్రక లక్ష్మీనారాయణ, పిరపాక శ్రీనివాసరావు, గంగుల రామారావు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : బోయ, వాల్మీకి తెగలను ఎస్టీ జాబితా చేర్చవద్దంటూ ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. గిరిజన సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు పత్తికి సలీం, ఎ.గంగాధర్ మాట్లాడుతూ బోయ, వాల్మీకి తెగలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దని, నాన్ షెడ్యూల్ గ్రామాలను ఐదో షెడ్యూల్ చేర్చాలని డిమాండ్ చేశారు. జిఒ 3కు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన గ్రామాలన్నింటికీ రహదారులు కల్పించాలని, జీడి పంటకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ నరసింహామూర్తికి వినతిని అందజేశారు. ధర్నాలో గిరిజన సంఘం నాయకులు ఎ.భాస్కరరావు, జె.శ్రీరాములు, పాలక సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : గిరిజనుల సమస్యల పరిష్కరించాలని, బోయ వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని, జీవో 3కు చట్టబద్ధత కల్పించాలని, నాన్ షెడ్యూల్ గ్రామాలను షెడ్యూల్లో చేర్చాలని కోరుతూ ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో చాలా ఏళ్ల నుంచి గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని, లచ్చందొర వలసలో సర్వే జరిపి పాస్ పుస్తకాలు ఇవ్వాలని, మట్టి రోడ్లు ఉన్న గిరిజన గ్రామాల్లో నిధులు కేటాయించి సిసి, తారు రోడ్లు వేయాలని, చెక్ డాములు వరహాలగెడ్డ రిజర్వాయర్ కాలువలు మరమ్మతు చేయాలని, జీడిపంటకు నష్టపరిహారం చెల్లించాలని, ఇళ్ల బిల్లులు బకాయిలు చెల్లించాలని, గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పి.రాము, అప్పలస్వామి, హిమరకి బలరాం, జి.సింహాచలం, బానమ్మ, పి.వాణి, వివిధ గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : గిరిజన ప్రాంత సమస్యలను పరిష్కరించాలంటూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సంఘం నాయకులు కె.సీతారాం మాట్లాడుతూ బోయవాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దని, జిఒ 3కు చట్టబద్ధత కల్పించాలని, నాన్ షెడ్యూల్ గ్రామాలను షెడ్యూల్ లో చేర్చాలి, గిరిజన గ్రామాలకు రోడ్లు వేయాలని, గిరిజనులు, పేదలు సాగు చేస్తున్న ప్రభుత్వ, బంజరు భూములు కు పట్టాలు ఇవ్వాలి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలను చెందిన గిరిజనులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పాలకొండ : బోయ, వాల్మీకిలను ఎస్‌టిల్లో చేర్చొద్దని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిఒ చట్టబద్ధత చేయాలని, గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని, జీడి పంటకు నష్టపరిపరిహారం చెల్లించాలని, శిథిలావస్థల్లో ఉన్న చెక్‌డ్యాంలు గుర్తించి నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ పి.సోమేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గంగయ్య, ఎస్.ఆనప, ఎ.భానుచందర్, ఎస్.మోహనరావు, గబ్రియల్, వై.సింప, ఎస్.రామరాజు, ఎ.ఒరియా, ఎస్.జోషి, ఎస్.ఆదియ్య పాల్గొనగా సిఐటియు మండల సమన్వయకమిటీ కార్యదర్శి కాద రాము మద్దతు తెలిపారు.

కొమరాడ : బోయ బోయ వాల్మీకులను ఎస్టిలో చేర్చొద్దని గిరిజన సంఘం నాయకులు జగ్గారావు, రామస్వామిమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి పనులు గిరిజన గ్రామాల్లో 250 రోజులు పని కల్పించాలని, గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు బాగిలి వెంకటేశు, రాజు, సోములు, భాస్కరరావు, సన్యాసిరావు, ం లక్ష్మమ్మ, గోపాల్, జగ్గారావు, ఎపి రైతు సంఘం నాయకులు ఎ.ఉపేంద్ర, సిఐటియు నాయకులు కె.సాంబమూర్తి పాల్గొన్నారు.

పాచిపెంట : బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చర్చే ప్రయత్నాలను మానుకోవాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మంచాల శ్రీను డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అటవీ బంజరు అన్సర్వేడ్ భూములను సర్వే చేసి గిరిజన రైతులకు పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. నాన్ షెడ్యూల్డ్ గ్రామాలను షెడ్యూల్డ్ గ్రామాలుగా గుర్తించి ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ వికాస్ పరిషత్ ఉపాధ్యక్షులు వి శ్రీనివాసరావు, సుర్రు రామారావు, సుర్రు వీరయ్య. తదితరులు పాల్గొన్నారు.




గుమ్మలక్ష్మీపురం : తహశీల్దార్ కార్యాలయం వద్ద ంంంంంంంంధర్నా చేస్తున్న గిరిజనులు



సీతంపేటలో ర్యాలీ చేస్తున్న గిరిజనులు;



పార్వతీపురంలో తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న గిరిజనులు



గుమడాం లేఅవుట్‌ను పరిశీలిస్తున్న పిఒ విష్ణుచరణ్

గృహ నిర్మాణాలు వేగవంతం

అధికారుల సమీక్షలో ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

ప్రజాశక్తి - సాలూరు

పట్టణానికి చెందిన జగనన్న లేఅవుట్ ల్లో పేదల ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని పార్వతీపురం ఐటిడిఎ పిఒ సిహెచ్.విష్ణుచరణ్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ, మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పేదల గృహ నిర్మాణంలో మున్సిపాలిటీ వెనుకంజలో ఉందని, ఇకపై అలా ఉండకూడదని చెప్పారు. లేఅవుట్లలో మొదటిగా మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. గృహ నిర్మాణానికి అనువైన వాతావరణం ఏర్పాటు చేయాలని సూచించారు. గహనిర్మాణాలకు ఇదే అనుకూల సమయమని చెప్పారు. లబ్దిదారుల్లో అవగాహన కల్పించి నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం నెలిపర్తి లేఅవుట్‌ను పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ హెచ్ శంకరరావు, ఎఇ సూరి నాయుడు, హౌసింగ్ డిఇ సోమేశ్వర రావు, ఎఇ టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

21 ఇసుక వాహనాలు పట్టివేత

ప్రజాశక్తి-పాలకొండ

మండలంలో అన్నవరం, యరకారాయపురం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇసుక రీచ్‌లను జిల్లా ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, అడిషనల్ ఎస్‌పి దిలీప్‌కిరణ్ గురువారం అర్థరాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించారు. అందులో ఇసుకతో ఉన్న 13 లారీలతో పాటు ఖాళీగా ఉన్న 7 లారీలను పట్టుకున్నారు. దీనిపై ఎస్‌పి ఆదేశాల మేరకు ఎస్‌ఐ శివప్రసాద్ కేసు నమోదు చేశారు. డ్రైవర్లు, క్లీనర్లుతో పాటు నిర్వహిస్తున్న ఇద్దరు నిర్వాహకులపై కూడా కేసు నమోదు చేశారు.

'దిశా 'పై న్యాయ అవగాహన సదస్సు

పార్వతీపురంరూరల్ : జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని చిన్న బొండపల్లి, ఎంఆర్ నగరంలో దిశాస్కీంపై గ్రామస్తులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞనారాయణరావు గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కోసం ఏర్పడిన ఈ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవడమే కాకుండా, తమ సెల్ ఫోన్లలో దిశయాప్‌ను డౌన్లోడ్ చేసుకుని తక్షణ రక్షణను పొందేందుకు అవకాశం ఉందని అన్నారు. అనంతరం సీనియర్ నాయకులు న్యాయవాదులు టి.జోగారావు, జి.వెంకట్రావు ప్రజలకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచులు గండి శంకరరావు, వంగపండు లక్ష్మి, వంగపండు త్రినాధ, బంకురు రవికుమార్ ,గ్రామస్తులు పాల్గొన్నారు.

పక్కాగా గోరుముద్ద అమలు : కలెక్టర్

ప్రజాశక్తి - కలెక్టరేట్

మధ్యాహ్నం భోజనం మెనూ పక్కాగా అమలు కావాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు.విద్యా శాఖలో జరుగుతున్న నాడు నేడు పనులపైన, ఆహార నాణ్యతపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల ఆహారంపై దృష్టి సారించాలని, వంటను ఒకరు బాధ్యతగా పర్యవేక్షణ చేయాలని ఆయన సూచించారు. అందుతున్న ఆహార పదార్థాల నాణ్యత విధిగా పరిశీలించాలని ఆయన ఆదేశించారు. విద్యార్థుల ఆహారంలో కలుషితం, అనారోగ్యం సంభవిస్తే బాధ్యులుపై చర్యలు కఠినంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. వంటకు వినియోగించే నీరు పరిశు భ్రంగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ వంట చేయడంలో అశ్రద్ద ఉండరాదని ఆయన స్పష్టం చేశారు. అలాగే నాడు నేడు పనులలో సీతానగరం చివరి మూడు స్థానాల్లో ఉందని ఆయన తెలిపారు. సీతానగరం మండలంలో పనులకు రూ.1.32 కోట్లు ముందస్తుగా విడుదల చేసినప్పటికీ రూ.1.12 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం పట్ల ఆయన ప్రశ్నించారు. పార్వతీపురం, సాలూరు మండలాల్లో రూ.30 లక్షలు చొప్పున, భామిని మండలంలో రూ.20 లక్షలు ఖర్చు కాకుండా ఉండటాన్ని ప్రశ్నించారు. వారం రోజుల్లో పనులు 95 శాతం పూర్తి కావాలని ఆదేశించారు. మరుగు దొడ్లు వద్ద శాశ్వత ప్రాతిపదికన రన్నింగ్ వాటర్ ఏర్పాటు తదితర అంశాలపై చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. పనులు పూర్తి అయ్యే వరకు కనీసం తాత్కాలిక చర్యలు చేపట్టాలని ఆయన చెప్పారు.

బై జ్యూస్ బోధన పట్ల మార్గదర్శనం

విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగు పడాలని, రానున్న పరీక్షలకు టెన్త్ విద్యార్థులకు తగిన తర్ఫీదు ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. బై జ్యూస్ బోధన పట్ల శ్రద్ధ వహించాలని, విద్యార్థులకు తగిన సూచనలు, సలహాలు, మార్గదర్శనం వహించాలని ఆయన అన్నారు. బడి బయట ఎక్కడా పిల్లలు ఉండరాదని ఆయన తెలిపారు. 9,10వ తరగతి విద్యార్థులు ఇంగ్లీష్‌లో మాట్లాడడం అలవాటు కావాలన్నారు. అన్ని సబ్జెక్టుల సిలబస్ పరిశీలించి, విద్యార్థుల నేర్చుకున్న అంశాలపై సామర్థ్యాన్ని పరీక్షించాలని ఆయన చెప్పారు. డిఇఒ డాక్టర్ ఎస్‌డివి రమణ మాట్లాడుతూ రూ.22.64 కోట్లు ముందస్తుగా విడుదలయ్యాయని, రూ.20 కోట్ల బిల్లులు అప్ లోడ్ చేశామని చెప్పారు. 61 ప్రహరీ గోడలకు మంజూరు చేయగా, 17 ప్రారంభమయ్యాయని ఆయన తెలిపారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీల బిల్లులు అక్టోబరు వరకు చెల్లించామని, నవంబరు, డిసెంబరు బిల్లులు అప్ లోడ్ చేసామని చెప్పారు. మక్కువ మండలంలో నాలుగు అంగన్వాడీ కేంద్రాల నిర్మాణానికి స్థలం సమస్య ఉందని ఎంఇఒ తెలిపారు. సమావేశంలో డిప్యూటీ డిఇఒ పి.బ్రహ్మాజీరావు, విజయకుమారి, ఎపిఒ వై.శంకర రావు, మండల విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు.




అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

నేడు న్యాయ అవగాహన సదస్సు

ప్రజాశక్తి - సీతంపేట

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు శనివారం నిర్వహించనున్నట్లు ఐటిడిఎ పిఒ బి.నవ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో దిశ చట్టం, మహిళలకు సంబంధించిన ఇతర చట్టాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమం ఉదయం 9 గంటలకు ఐటిడిఎ సమావేశ మందిరంలో ప్రారంభం అవుతుందని తెలిపారు.



రిజిస్ట్రేషన్ పత్రాలను పరిశీలిస్తున్న కమిషనర్ రామ అప్పలనాయుడు

నెలాఖరికి టిడ్కో ఇళ్ల రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఈ నెలాఖరు నాటికి టిడ్కో గృహ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసి ఉగాది నాటికి ఇళ్లను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషన్ ఛాంబర్‌లో టిడ్కో గృహాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను మున్సిపల్ ఉద్యోగులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో పలు వార్డుల్లో ఇళ్లులేని నిరుపేదలకు రూపాయికే అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఉచితముగా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్న దృష్ట్యా 768 మంది లబ్ధిదారులకు అడ్డాపుశిల వద్ద 16 బ్లాకుల్లో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాల్లు ప్రారంభించామన్నారు. ఇందులో 11 బ్లాకుల్లో నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలిన 5 బ్లాకుల్లో పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు. ఈనెల 5 వరకు 500 ఇళ్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన 268 ఇళ్లకు ఈ నెలాఖరులోగా రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేయడం జరుగుతుందని అన్నారు. ఉగాది నాటికి లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు.

అటవీ ఉత్పత్తుల కొనుగోలు వేగవంతం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

అటవీ ఉత్పత్తుల కొనుగోలులో వేగవంతం పెంచాలని జిసిసి పార్వతీపురం డివిజనల్ మేనేజర్ మహేంద్ర కుమార్ సిబ్బందికి సూచించారు. గుమ్మలక్ష్మీపురంలో ఉన్న పెట్రోల్ బంక్, జిసిసి గోదాములు పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రస్తుత సీజన్‌లో కరక్కాయ, నల్ల జీడి, ఎండు ఉసిరి, నరమామిడి చెక్క, ముషిడిక పిక్కలు తదితర నాణ్యమైన రకాలు గిరిజనుల నుంచి కొనుగోలు చేయాలన్నారు. ఉసిరిక పప్పు కిలో 60 నుంచి రూ.80లు, నల్ల జీడి 12 నుంచి రూ.15 కు ధర పెంచామని తెలిపారు. రానున్న చింత పండు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైంది సేకరించాలని సూచించారు. 2020-21లో జిసిసి ద్వారా 10200 క్వింటాళ్లు కొనుగోలు చేశామన్నారు. ఆర్‌బికె ద్వారా ధాన్యం కొనుగోలు కూడా చేస్తున్నమని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక జిసిసి బ్రాంచి మేనేజర్ కృష్ణ ప్రసాద్, గోదాము సూపరిండెంట్ సాంబ శివరావు ఉన్నారు.

మాదకద్రవ్యాల అనర్థాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరిగిపోతున్న మాదక ద్రవ్యల వినియోగం దానివల్ల యువతకు కలిగే అనర్థాలపై శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎఎస్‌పి దిలీప్ కుమార్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీవితంలో మంచి కెరీర్ నిర్మించుకునే వయస్సులో మాదకద్రవ్యాల వినియోగం చేటు తెస్తుందని, సరదాగా మొదలైన అలవాట్లు తర్వాత ప్రాణాంతకంగా మారి వెలుగులు చందాల్సిన జీవితంలో చీకటి నింపుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులతో మారకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞలు చేయించారు. కార్యక్రమంలో ఎస్‌ఇబి అధికారులు, కళాశాల ప్రిన్సిపల్ ఆకుల రాజు తదితరులు పాల్గొన్నారు



సదస్సులో మాట్లాడుతున్న ఎఎస్‌పి దిలీప్‌కుమార్



పశువైద్యశాలలో మందులను పరిశీలిస్తున్న జెడి ఈశ్వరరావు

పిఎంఇజివైని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

నిరుద్యోగ యువత ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం (పీఎంఈజీవై) కింద సబ్సిడీపై లభిస్తున్న పలు పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని జిల్లా పశుసంవర్ధక జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎ.ఈశ్వరరావు కోరారు. శుక్రవారం ఆయన స్థానిక వెటర్నరీ డిస్పెన్సరీకి వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంత యువతకు 35 శాతం సబ్సిడీపై డెరీయింగ్, నాటు కోళ్లు, పశువుల పెంపకం తదితర లాభసాటి స్కీములను అందిస్తున్నామని అన్నారు. అలాగే మైదాన ప్రాంత యువతకు 25శాతంపై పలు రకాల ఉపాధి పథకాలు అందిస్తున్నామన్నారు. ఆయా పథకాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. వీటి కొరకు అప్లికేషన్లు ఆన్లైన్లో పెట్టుకోవాలని బిసి, ఒసి తదితర కులాలు అర్హులన్నారు. అలాగే వైయస్సార్ చేయూత వచ్చే ప్రతి లబ్ధిదారులు పశువులను కొనుగోలు చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 2లక్షల 50 వేలు ఆవులు ఉన్నాయని, వీటన్నింటికీ ముందస్తు జాగ్రత్త చర్యలుగా లంపి స్కిన్ వ్యాధి రాకుండా డోసులు వేస్తున్నామని అన్నారు. అలాగే 4లక్షల గొర్రెలు, మేకలు ఉన్నాయని, మరో 10 లక్షలు వరకు పౌల్ట్రీ కూడా జిల్లాలో ఉందని అన్నారు. పశువుల మేత కొరకు సమీకృత పశు దానాను 60 శాతం సబ్సిడీపై అందిస్తున్నామని అన్నారు. ఆసక్తి ఉన్న రైతులు గడ్డి విత్తనాలు కావాల్సి వస్తే 15 టన్నులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. జిల్లాలో 16 వైద్యులు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలో భర్తీ చేస్తామని అన్నారు. అలాగే జిల్లాలో 60 వరకు శిథిలావస్థలో ఉన్న వెటర్నరీ ఆసుపత్రి భవనాలకు మరమ్మతుల కోసం ప్రభుత్వానికి నివేదించామన్నారు. అనంతరం రస్తా కుంటు బాయ్, గుమ్మ లక్ష్మీపురం మండలాల్లో పలు రైతు భరోసా కేంద్రాలను పరిశీలించారు. ఈయన వెంట భద్రగిరి వెటర్నరీ వైద్యులు లక్ష్మణరావు, తదితరులు ఉన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



మండల వ్యవసాయాధికారిని నిలదీస్తున్న రైతులు

మా ధాన్యం కొనరా..?

వీరఘట్టం: మండలంలోని చలివేంద్రి గ్రామ రైతులు ధాన్యం కొనరా అంటూ శుక్రవారం స్థానిక ఆర్‌బికే వద్ద ఆందోళన చేశారు. మండలంలోని పక్క గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు చేస్తున్నారని, తమ గ్రామానికి వచ్చేసరికి కొనుగోలు లేవని, వాహనాలు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలులో అధికారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారు ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు లేక కళ్లలో కావలా కాయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందనిమండల వ్యవసాయ అధికారిని నిలదీశారు. తక్షణమే ధాన్యం కొనుగోలు చేసి సమస్యను పరిష్కరించాలని రైతులు వేడుకున్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

ఎన్‌జిఒ అసోసియేషన్ కేలండర్ ఆవిష్కరణ

జియ్యమ్మవలస: ఏపి ఎన్‌జిఒ ప్రచురించిన కేలండర్‌ను కురుపాం ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి శుక్రవారం చినమేరంగిలో తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులను ఎన్జీవో సంఘం నాయకులు ఉద్యోగులు సత్కరించారు. కార్యక్రమంలో ఏపి ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి బి.రామకృష్ణ, కోశాధికారి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిఎంజెజెబివైతో కుటుంబానికి భరోసా

భామిని: కుటుంబానికి పెద్దయిన వ్యక్తి అనుకోని ప్రమాదంలో మృతి చెందినా, సహజ మరణం చెందినా ఆ కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందిస్తున్న ఇన్సూరెన్స్ పథకాలైన పిఎంజెజెబివై, పిఎంఎస్‌బివై సహకరిస్తాయని బత్తిలి బ్రాంచ్ మేనేజర్ బి.బంగారునాయుడు తెలిపారు. బత్తిలి ఎపిజివిబి బ్రాంచ్ ఖాతాదారైన ఎస్.కైలాస్ ఇటీవల మృతి చెందడంతో పిఎంజెజెబివై బీమా పాలసీ ద్వారా వచ్చిన రూ.2 లక్షల చెక్కును కైలాష్ భార్య మణికి అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ గోవిందకృష్ణ, క్యాషియర్ వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

ఉరిడిలో గడపగడపకు ...

కురుపాం: మండలంలోని ఉరిడి పంచాయతీలో గల గిరిజన గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో అన్ని ఇళ్లకు వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, నవరత్నాలు గురించి అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉంటే సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిసార్, జెడ్‌పిటిసి గొర్ల సుజాత, మండల కన్వీనర్ ఐ.గోరేశంకర్, మాజీ ఎంపిపి ఎ.ఇంద్రకుమారి, వైస్ ఎంపిపి రంగారావు, మొండెంఖల్ ఎంపిటిసి సభ్యులు జి.విద్యారాణి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది వాలంటర్లు పాల్గొన్నారు.



జిజె కాలేజీలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న డిఇఒ రమణ

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి : డిఇఒ

సీతానగరం: నిర్మాణ పనులు త్వరితగా పూర్తి చేయాలని డిఇఒ డివి రమణ అన్నారు. మండలంలోని పెదబోగిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న నాడు నేడు పనుల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో విడత మంజూరైన పనులు, నిర్మాణ పనులు, భవనిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే పనులు ప్రారంభమైనప్పటికీ మందకొడిగా సాగుతున్నాయని, వీటిని పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ జి.సూర్యదేవుడు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బిల్లులను ఆన్‌లైన్‌లో పంపాలి

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం, కొమరాడ మండలాల గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి గృహ సంరక్షకులు ప్రతినెలా బిల్లులన్నీ ఆన్లైన్లోనే పంపించాలని ఎటిడబ్ల్యూఒ సురేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో హాస్టల్ వార్డెన్లు, జిసిసి గోదాం సూపరింటెండెంట్లతో సమావేశమై మాట్లాడారు. ఇకపై ప్రతినెలా వసతి గృహ సంరక్షకులు ఆన్లైన్ లోనే బిల్లులన్నీ పంపించాలన్నారు. ముందుగా బిల్లులను క్షుణ్ణంగా స్క్రూటీని చేసుకొని అనంతరం ఆన్లైన్లో సబ్మిట్ చేయాలన్నారు. అనంతరం బిల్లులన్నీ తన కార్యాలయానికి సమర్పించాలని అన్నారు. అలాగే టెన్త్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని కోరారు. సమావేశంలో జిసిసి గోదాం సూపరింటెండెంట్ సాంబశివరావు, పలు వసతి గహ సంరక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు చర్యలు

కలెక్టరేట్: వినియోగదారుల రక్షణ చట్టం ప్రకారం వినియోగదారుల హక్కులకు కల్పిస్తూ వారిలో బాధ్యత, చైతన్యం తీసుకురావడం కోసం అనేక చర్యలు చేపట్టడం జరిగినదని జిల్లా పౌర సరఫరాల అధికారి కెవిఎల్ఎన్ మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమర్థవంతమైన వినియోగదారుల వివాదాల పరిష్కార వేదికలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చిందని. ఇందులో భాగంగా రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యాలయంలో ప్రజలు, వినియోగదారులు, ధాన్యం కొనుగోలు సంబంధిత సమస్యలను తెలిపేందుకు పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటరును ఏర్పాటుకు దేశాలను జారీ చేశారని తెలిపారు. ఈ ఆదేశాల మేరకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న వివిధ టోల్ ఫ్రీ నెంబర్లు 1800 425 0082/ 1967 (పౌరసరఫరాల శాఖ).1800 425 3157 / 14445 (ఒకే దేశం ఒకే రేషన్ కార్డు),1800 425 2388/ 155235 (రాష్ట్ర ఆహార కమిషన్).1800 425 4202 (తూనికలు కొలతల శాఖ)ను సంప్రదించాలని సూచించారు.

అంకితభావంతో సేవలందించాలి

పార్వతీపురం టౌన్: సిహెచ్ఒలు అంకితభావంతో సేవలు అందించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి జగన్మోహన్రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని బెలగాంలో గల గిరిజన సామాజిక భవనంలో జరుగుతున్న సిహెచ్ఒల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన సందర్శించి, శిశు ఆరోగ్య కార్యక్రమాలు, టీకాల నిర్వహణ కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 26 నుంచి జిల్లాలోని హెల్త్ వెల్నెస్ కేంద్రాలకు చెందిన సిహెచ్ఒలకు అన్ని ఆరోగ్య కార్యక్రమాలపై దశల వారీగా ప్రారంభమైందన్నారు. ఐదేళ్లలోపు పిల్లల్లో వచ్చే ఆరోగ్య సమస్యల నివారణా చర్యలు, ప్రతివారం రెండుసార్లు ఇస్తున్న ఐరన్ ఫోలిక్ యాసిడ్ సిరప్స్, షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తున్న సార్వత్రిక టీకా కార్యక్రమం, శ్వాసకోశ సంబంధమైన వ్యాధులు నివారణ దిశగా చేపడుతున్న శాన్స్, పోషకాహార లోప పిల్లలను గుర్తించి, అవసరమైన వారిని ఎన్ఆర్సి కేంద్రాలకు రిఫర్ చేయడం తదితర కార్యక్రమాలను వివరించారు.



సిహెచ్ఒల శిక్షణలో మాట్లాడుతున్న డిఐఒ జగన్మోహనరావు

పింఛన్లతో ఆదుకుంటున్న ప్రభుత్వం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కురుపాం

అవ్వా, తాతలకు తలుపుతట్టి పింఛన్లు ప్రభుత్వం అందజేస్తుందని స్థానిక ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి అన్నారు. స్థానిక పెట్రోల్ బంకు సమీపాన శుక్రవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గానికి కొత్తగా 1667 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలను పెట్టి ఏ పని కావాలన్నా సంతకాలు నిమిత్తం వారి చుట్టూ తిప్పించుకునేవారని, పింఛనుదార్లు ఆ కమిటీ చుట్టూ తిరిగి కాళ్లు అరిగేలా చేసి చివరకు వారు పార్టీ వారికి మాత్రమే పింఛన్లు అందించేవారు కాని విమర్శించారు. తమ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా అర్హులైన అందరికీ పింఛన్ మంజూరు చేస్తుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, ఎంపిపిలు కుంబిరిక దీనమయ్య, ఉరిటి రామారావు, శెట్టి శ్యామల, జెడ్‌పిటిసి సభ్యులు జి.సుజాత, ఎం.రాధ, ఎం.శశికళ, డిఆర్‌డిఎ పిడి పి.కిరణ్ కుమార్, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిసార్, ఎంపిడిఒలు వివి శివరామప్ప, జి.పైడితల్లి, ఎస్.రమేష్, జె.జగదీష్ కుమార్, ఎల్‌వి అప్పారావు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, ఎంపిటిసి సభ్యులు వి.బంగారు నాయుడు, సర్పంచ్ జి.సుజాత, ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, ఐదు మండలాల కన్వీనర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు , సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలానికి కొత్తగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే ఎ.జోగారావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా మండలానికి 428 పింఛన్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బి.రమణమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, ఎంపిడిఒ బి.కృష్ణమహేశ్‌రెడ్డి, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు బి.చిట్టిరాజు, కన్వీనర్ బి.శ్రీరాములునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మక్కువ: మండలంలోని పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం పి.రాజన్నదొర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ల పెంచుతున్నారని, భవిష్యత్తులో మరిన్ని పథకాలు రావాలంటే జగన్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పిటిసి మావుడి శ్రీనివాసరావు, ఎంపిపి మర్రి పారమ్మ, వైసిపి నాయకులు మామిడి రంగనాయుడు వివిధ పంచాయతీల నుంచి వచ్చిన వైసిపి నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోనివండువ కత్తులకవిటి ఎమ్మెల్యే వి.కళావతి, జెడ్‌పిటిసి జంపు కన్నతల్లి- ఉమామహేశ్వరరావు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన వారికి అనేక సంక్షేమం పథకాల అందిస్తుందని అందులో భాగంగా పింఛన్ కూడా అర్హులైన వారికి అందిస్తుందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కళ్యాణి, గేదెల సరోజిని, ఎంపిటిసి కొత్తకోట పరిమిల, మండల ఉపాధ్యక్షులు వి.భరత్, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలో 17వ వార్డులో వార్డు కౌన్సిలర్ దుప్పాడ పాపినాయుడు శుక్రవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ కార్యదర్శి ఝాన్సీ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



మక్కువ : సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

వారం రోజుల్లో పనులు పూర్తిచేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

రెవెన్యూకు సంబంధించిన పెండింగు పనులన్నీ వారం రోజుల్లో పూర్తిచేయాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తహశీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం సంయుక్త కలెక్టరు ఒ.ఆనంద్‌తో కలిసి తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూకు సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమీక్షా సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ ఇళ్ల స్థల పట్టాలకు ఇ-కెవైసీ పూర్తి చేయాలని, ఇంకా 1368 పట్టాలు పంపిణీ చేయాల్సి ఉందని, వీటి పంపిణీ వెంటనే పూర్తి చేయాలని అన్నారు. ఇళ్ల స్థలాలకు భూమి అవసరమైన చోట ప్రభుత్వ భూమిని గుర్తించాలని లేదా భూమార్పిడి విధానం, భూసేకరణ విధానాలలో సేకరించాలని తెలిపారు. గ్రామాల్లో అసైన్డ్ భూములకు సంబంధించిన వివరాలు సేకరించాలన్నారు. ఫీల్డ్ పిఒఎల్ఆర్ పనులు కొన్ని మండలాల్లో ప్రారంభం కాలేదని, గ్రామ రెవెన్యూ అధికారులు జమాబందీ నిర్వహించి ప్రతి సర్వే నెంబరులో సాగుదారుల వివరాలు సరిగ్గా ఉన్నదీ లేనిది పరిశీలించాలని, రికార్డుల్లో అవసరమైన మార్పులు చేపట్టి సరయైన రికార్డు తయారు చేయాలని తెలిపారు. రీ-సర్వే నిర్వహించిన గ్రామాల్లో పట్టాల పంపిణీ పూర్తిచేయాలన్నారు. డిజిటల్ సంతకం, ఫోటో అప్లోడు పనులు వెంటనే పూర్తిచేయాలని తెలిపారు. మ్యుటేషన్ సంబంధించి కొనుగోలు జరిగిన భూములు, చనిపోయిన వారి భూములు వారసులకు బదలాయింపు, పంపకాలు జరిగిన వివరాలను నమోదు పూర్తిచేయాలని, అలాగే జిల్లాలో 80 గ్రామాల 22(ఎ) భూముల వివరాలు వారం రోజుల్లో పంపాలని సూచించారు. పనులు పురోగతిపై రోజువారి నివేదికలను సమర్పించాలని డివిజనల్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో సబ్ కలెక్టరు నూరుల్ కమర్, ఆర్డిఒ హేమలత, కలెక్టరు కార్యాలయ సూపరింటెండెంటు శ్రీరామమూర్తి, రవి , తహశీల్దార్లు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు, ఎఎన్‌ఎంలు

గోరుముద్దపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని అరసాడలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం జగనన్న గోరుముద్ర కార్యక్రమంపై స్థానిక అంగన్వాడీలు, ఎఎన్ఎంలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు రక్తహీనత వల్ల అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, మధ్యాహ్న భోజన పథకం అమలులో మంచి పోషకాలు గల నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నారని అన్నారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల్లో కూడా పిల్లలకు మంచి పోషకాహారం విటమిన్లు ఇచ్చే ఆహారం అందుతుందని, ఈ అవకాశాన్ని పిల్లలు వినియోగించుకుంటే రక్తహీనత నుంచి తమను తాము కాపాడుకోవచ్చని తెలిపారు. వ్యాధి నిరోధకశక్తి పెరగడంతో పాటు, వివిధ రకాల ఉపయోగాలు విద్యార్థులకు ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎఎన్ఎం జి.వరలక్ష్మి, విఒఎ జి.భారతి, అంగన్వాడీలు మురళి, లలిత విద్యార్థుల తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

రుణాలతో మహిళల ఆర్థిక స్వావలంబన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

బ్యాంకు రుణాలు ఆసరాగా చేసుకుని స్వయం సహాయక మహిళలు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థిక స్వావలంబన సాధించాలని డిఆర్‌డిఎ పిడి పి కిరణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెదబొండపల్లిలో జరిగిన రుణమేళా కార్యక్రమంలో ఎపిజివిబి మండలంలో గుర్తించిన 62 మహిళా సంఘాలకు రూ.3,51,50,000 రుణాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ రుణాలు తీసుకొని చిన్న, చిన్న వ్యాపారాల ద్వారా అదనపు ఆదాయం పొందాలన్నారు. ఎపిజివిబి రీజనల్ మేనేజర్ సోమేశ్వరరావు మాట్లాడుతూ రుణాలతో పాటు బీమా సౌకర్యం కూడా ప్రభుత్వ మార్గాలకు అనుగుణంగా బ్యాంకు వారు సేవలందిస్తున్నారని తెలిపారు. ఎపిడి వై.సత్యంనాయుడు మాట్లాడుతూ అవసరాన్ని బట్టి అప్పు తీసుకొని జీవనోపాధులు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఎపిజివిబి పెదబొండపల్లి మేనేజర్ శైలజ మాట్లాడుతూ రుణాలను సక్రమంగా చెల్లించిన వారికి వడ్డీ రాయితీ వస్తుందని తెలిపారు. ఫీల్డ్ ఆఫీసర్ శంకరరావు మాట్లాడుతూ మహిళలు ప్రతి నెలా రుణాలు చెల్లించాలన్నారు. ఎపిఎం పి.సురేష్ మహిళలు ఈ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సవరపు తౌడమ్మ, మహిళా సంఘ సభ్యులు, సిసిలు, విఒఎలు హాజరయ్యారు.

నాడు-నేడు పనులపై సభ్యులు ధ్వజం

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ద్వారా నిర్వహిస్తున్న నాడు-నేడు పనులు సక్రమంగా జరగలేదని పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు అధికారులపై ధ్వజమెత్తారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి బి.ఆదినారాయణ అధ్యక్షతన స్థానిక వైటిసిలో శుక్రవారం నిర్వహించారు. మండ స్కూలు గేటు లైట్లు వేయలేదని, పర్యవేక్షణ లేదని మండ సర్పంచ్ సభ దృష్టికి తీసుకువచ్చారు. దబర, రామానగరం పాఠశాలలకు భవనాల్లేవని, రామానగరం పాఠశాలలో 45 మంది పిల్లలు ఉన్నప్పటికీ రేకుల షెడ్‌లో స్కూలు నడుస్తుందని, దబరు పాఠశాల భవనం లేనప్పటికీ నాడు నేడు కింద నిధులు ఎలా మంజూరు చేశారని ప్రశ్నించారు. రెండింటికీ భవనాలు మంజూరు చేయాలని కోరారు. చిన్న బగ్గ పాఠశాలలో కనీసం వంటగదికి రేకులు లేవని ఎంపిపి సభ దృష్టికి తీసుకొచ్చారు. చావిడ వలసలో స్కూల్ బిల్డింగ్ భవనం కూడా గేటు వేయలేదన్నారు. సమాధానం చెప్పలేక ఇంజనీరింగ్ అధికారులు నీళ్ల నమ్మిళారు. ఎమ్మెల్యే వి.కళావతి కలుగజేసుకొని పనులు సక్రమంగా శరవేగంగా పూర్తి చేయాలన్నారు. దారపాడు సర్పంచ్ సుందరమ్మ సచివాలయాలు పూర్తి ఎందుకు పూర్తి కాలేదని జాప్యం ఎందుకని ప్రశ్నించారు. వరద గోడలు, సిసి రోడ్లు గ్రామాల్లో లేవని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రిలో వైద్యుల ఫోన్‌నెంబర్లు, సేవలు బోర్డులో ఉండాలన్నారు. సచివాలయం బయట కూడా డిస్‌ప్లే బోర్డు ఉండాలని అన్నారు. సమావేశంలో జడ్పిటిసి లక్ష్మి, జిల్లా కోఆప్షన్ సభ్యులు లక్ష్మి, ఎఎంసి చైర్మన్ మోహన్‌రావు, వైస్ ఎంపిపి సరస్వతి, ఎంపిడిఒ కె.గీతాంజలి ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.మురళి, సూపరిండెంట్ శ్రీనివాసరావు, పలుశాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు కేటాయించాలి

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు కేటాయించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఎన్‌వై నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. 12ఏళ్లుగాప్రభుత్వ ఐటిఐ అద్దె భవనంలో కొనసాగుతున్నదని చెప్పారు. ఇరుకు గదుల్లో తరగతులు నిర్వహించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయం కూడా అనేక ఏళ్ళుగా అద్దె భవనంలో కొనసాగుతుందని, పాఠకులకు అసౌకర్యంగా ఉందని అన్నారు. రైతు బజార్‌ను నిర్మించి వినియోగంలో తేకుండా వదిలేశారని చెప్పారు. అధికారులు వెంటనే ప్రభుత్వ ఐటిఐ, గ్రంథాలయాలకు భూములు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు పి.సురేష్ పాల్గొన్నారు.

డ్రైడే పాటించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రతి ఒక్కరూ డ్రై డే ను పాటించాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. శుక్రవారం డ్రైడేలో భాగంగా స్థానికవసుంధర నగర్, వెంకం పేట వద్ద జిల్లా మలేరియా అధికారితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని తద్వారా దోమలను నివారించవచ్చని అన్నారు. శుక్ర వారం ఇంట్లో అన్ని పాత్రలను ఖాళీ చేసి ఎండలో పూర్తిగా అరవేయాలని తద్వారా అందులో ఉండే బ్యాక్టీరియా, లార్వా పూర్తిగా నశించిపోతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి కె. పైడి రాజు, సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాల పంపిణీ

సీతానగరం: ప్రత్యేక అవసరాలు గల 9మంది పిల్లలకు ఉపకరణాలను శిశు సంక్షేమ సమగ్ర అధికారి పి.భానుప్రసాద్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగ విద్యార్థులకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు. వారం వారం ఫిజియోథెరపీ కార్యక్రమం కూడా నిర్వహిస్తుందన్నారు మండలాల్లో 9మందికి మూడు ట్రైసైకిళ్లు, 3 వీల్ చైర్స్, 3 వినికిడి యంత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పి.కృష్ణమోహనరావు, రేణుక, పి.పైడ్రాజు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి విరాళం


ప్రజాశక్తి - భామిని

మండలంలోని ఘనసరాలో మదన కామేశ్వర దేవాలయానికి బెంగుళూరులో ఉంటున్న నులకోజోడుకు చెందిన చిన్ని శేఖర్, లావణ్య దంపతులు ఆలయ అభివృద్ధికి లక్ష రూపాయిలు చెక్కును శుక్రవారం ఆలయం కమిటీ సభ్యులకు ఆయన సోదరుడు చిన్ని రవి ద్వారా అందజేశారు. ఆలయ అభివృద్ధికి లక్ష విరాళం అందజేసినందుకు ఆలయం కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపతి ఆనందరావు, కొవ్వాడ చిరంజీవులు, సర్పంచ్ కిల్లారి పాల్గుణరావు, కమిటీ సభ్యులు వున్నారు.

10న వాహనాల వేలం

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ నేరాలతో పట్టుబడి స్వాధీన పర్చుకున్న ఏడు ఆటోలు, రెండు ద్విచక్ర వాహనాలను ఈ నెల 10 న పోలీసు స్టేషన్ వద్ద వేలం వేస్తున్నట్లు ఎస్సై సి హెచ్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలంలో పాల్గొని ఆసక్తి గల వారు వివరాల కోసం పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.



క్వార్టర్స్‌కు స్థలపరిశీలన చేస్తున్న సబ్‌కలెక్టర్ నూరల్‌కమర్

ఎంఐజి క్వార్టర్స్‌కు స్థల పరిశీలన

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

ఉద్యోగుల కోసం నిర్మిస్తున్న ఎంఐజి క్వాటర్స్‌కు శుక్రవారం సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ స్థల పరిశీలన చేశారు. అట్టలి వద్ద ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఎన్ని ఎకరాలు భూమి ఉంది, దాని పరిస్థితి ఏమిటని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట తహశీల్దార్ పి.సోమేశ్వరరావు ఉన్నారు.

అరాచక పాలనలో గిరిజనాభివృద్ధి శూన్యం : టిడిపి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వైసిపి మూడేళ్ల అరాచక పాలనతో గిరిజన అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని కురుపాం నియోజకవర్గం టిడిపి సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి అన్నారు. మండలంలోని పెదఖర్జ పంచాయతీ గొరటిలో ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం నిత్యవసరాల ధరలు పెంచుతూ ప్రజలను పూర్తిగా దోచుకుతింటుందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో సాగునీటి వనరులు అభివద్ధికి నోచుకోలేదన్నారు. గిరిజనుల ఉపాధి కోసం ఇస్తున్న ట్రై కార్ రుణాలు రద్దు చేసిందని, గిరిజన యువత ఉపాధి శిక్షణ కోసం ఏర్పాటు చేసిన వైటిసిలు లను పూర్తిగా మూసివేసిందని అన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి వెళుతున్న టిడిపి అధినేత చంద్రబాబుకు వస్తున్న ప్రజాదారణ చూసి ఓర్వలేక చీకటి జీవోలు తీసుకురావడం విచారకరమన్నారు. ప్రజల కష్టాలు తీరాలంటే రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టిడిపి ఎమ్మెల్యే టికెట్ ఆశావాహి ఆర్ఎస్ఎస్ విజయకుమార్, నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

భామిని: మండలంలోని కీసర, కొసలి, ఘనసరా గ్రామాల్లో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం టిడిపి పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యాన జరిగింది. రాష్ట్రంలో సామాన్యులు జీవన స్థితిగతులు, ఆర్థిక పరిస్థితిలు మెరుగుపడాలన్నా, అభివృద్ధితో కూడిన ప్రశాంత వాతావరణంలో మంచి పరిపాలన కావాలంటే టిడిపితోనే సాధ్యం అవుతుందని అన్నారు. కార్యక్రమం టిడిపి ప్రధాన కార్యదర్శి మేడిబోయిన జగదీశ్వరరావు, మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు, టిడిపి మండలం అధ్యక్షులు బోగాపురపు రవి నాయుడు, సర్పంచ్ ప్రతినిధి లోపింటి రాజేష్, ఒమ్మి గోపాల్ దాసు, పోలాకి రామారావు, సిర్ల అశోక్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

గమలక్ష్మీపురం: ఇదేం కర్మ కార్యక్రమాన్ని నొండ్రు కోన పంచాయితీ కల్లిటిలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ తోయక జగదీశ్వరి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు, ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ వెంకట్రావు నాయకులు వెంకట్రావు, అడ్డాకుల నరేష్ పాల్గొన్నారు.



గొరటిలో ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు పద్మావతి

అధిక దిగబడుల కోసమే సలహా మండలి సమావేశాలు

ప్రజాశక్తి - పాచిపెంట

అధిక దిగుబడుల కోసమే వ్యవసాయ సలహామండలి సమావేశాలను నిర్వహిస్తున్నట్టు పాంచాలి, మాతుమూరు వ్యవసాయ సలహా మండలి చైర్మన్లు సేనపతి నారాయణరావు, శనగల సింహాచలం అన్నారు. ఆయా ఆర్‌బికెల్లో శుక్రవారం వ్యవసాయ సలహా సంఘ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల్లో వారు మాట్లాడుతూ సాగు సమస్యలను ఎప్పటికప్పుడు తీర్చుతూ గ్రామస్థాయి సమస్యలను మండల, జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండళ్లకు తెలిపి, సాగు సమస్యలను తీర్చనున్నట్టు తెలిపారు. ప్రస్తుతం మొక్కజొన్న సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించారు. ఆర్‌బికెల వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ధాన్యపు కొనుగోలు సక్రమంగా జరుగుతున్నాయని, ఎరువులు విత్తనాలు రైతు ముంగిటే అందుతున్నాయని, కియోస్కుల ద్వారా సీజనకు ముందుగానే పురుగుమందులు కావాల్సిన రైతులు ఆర్డర్ పెట్టుకునేలా రైతులను ప్రోత్సహించి సరియైన సమయానికి ఆ మందులు గ్రామానికి వచ్చేలా చేసినట్లయితే రైతులకు ఎంతో మేలవుతుందని తెలిపారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు మెగ్నీషియం, బోరాను వంటి సూక్ష్మ పోషకాలు అందించాలని, పత్తి పంటలో వీటి వినియోగం ఎక్కువగా ఉన్నందున ఆర్‌బికెల ద్వారా రైతులకు అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం ప్రకృతి సేద్య సిఆర్పి బాలకృష్ణ పంటల పెరుగుదలకు ఉపయోగపడే జిల్లేడు కషాయం తయారీని చేసి చూపించారు. ఎఒ కె.తిరుపతిరావు మాట్లాడుతూ అన్ని పంటల్లో పెరుగుదలకు జిల్లేడు కషాయం ఎంతగానో ఉపయోగపడు తుందని, ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండానే పంటకు ఎంతో బలాన్ని చేకూర్చే జిల్లేడు కషాయం వినియోగించే దిశగా రైతులు ఆలోచన చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న పెద్దలు పెదబాబు, ధనుంజయరావు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలు పాటిస్తూ వ్యవసాయ సలహా మండలి లో సాగు సమస్యలను చర్చిస్తూ పరిష్కారాలను కనుగొని రైతులు అధిక దిగుబడులు పొందేందుకు వ్యవసాయ సలహా మండలి ఎంతో ఉపకరిస్తున్నాయని అన్నారు ఈ కార్యక్రమంలో విఎఎ లు శ్రీను మరియు దినేష్ రైతులు పాల్గొన్నారు